క్లుప్తంగా

చురుగ్గా బ్రహ్మంగారి ఆలయ నిర్మాణం



నిర్మాణంలో ఉన్న అంగర వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయం

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర గ్రామంలో చేపట్టిన శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. శ్రీ అశిరాంబిక అమ్మవారి ఆలయ సమీపంలో ఈ ఆలయం నిర్మితమవుతోంది. గ్రామానికి చెందిన విశ్వ బ్రాహ్మణ సామాజిక వర్గీయులు దీర్ఘకాలంగా ఆలయ నిర్వహణ బాధ్యతలు చూస్తున్నారు. పాత ఆలయ స్థానంలో నూతన ఆలయాన్ని నిర్మిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

లోడు లారీ దిగబడి ట్రాఫిక్ ఇబ్బందులు

కపిలేశ్వరపురం: మండలంలోని కాలేరు నుంచి వెదురుమూడి వైపు ధాన్యం లోడుతో వస్తున్న లారీ చక్రం నల్లూరు సమీపంలో రోడ్డు మధ్యలో ఉన్న గోతిలో పడి నిలిచిపోయింది. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటనతో ఆయా గ్రామాల మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. లారీ యాజమానులు మరో లారీలోకి లోడును మార్చి నిలిచిన వాహనాన్ని తరలించడంతో సమస్య పరిష్కారమైంది. శనివారం ఉదయం రామచంద్రపురం, మండపేట, ఆలమూరు, అంగరలోని విద్యాసంస్థలకు వెళ్ళే వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్ళించారు.

తోడుగుడ్లపాడులో వాటర్ ట్యాంక్ నిర్మాణం

కపిలేశ్వరపురం: మండలంలోని నాగులచెరువు గ్రామ శివారు తోడుగుడ్లపాడులో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భాగ్యరాజ్ పర్యవేక్షణలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ పిల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం పునాది పనులు చేశారు. మారుమూల గ్రామమైన తోడుగుడ్లపాడు నివాసితులకు సురక్షితమైన తాగునీరు సరఫరా చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని చేపట్టింది. త్వరితగతిన నిర్మాణ పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్టు ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి తెలిపారు.

పరిసరాల శుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం

కాజులూరు: పరిసరాల శుభ్రతపైనే ఆ గ్రామ ప్రజల ఆరోగ్యం పరిస్థితులు ఆధారపడి ఉంటాయని గొల్లపాలెం పంచాయతీ కార్యదర్శి చెల్లుబోయిన వేణుగోపాలరావు అన్నారు. శనివారం గ్రామంలో పారిశుధ్య కార్మికులతో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించి పరిసరాల శుభ్రత, వ్యాధుల నిర్మూలన అనే అంశంపై సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించటం, విరివిగా మొక్కలు నాటడం ద్వారా కాలుష్య నివారణ జరిగి ప్రజలు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు.

రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలి

కె.గంగవరం: ఈ నెల 21, 22 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని ఏపీ ఎన్జీఓల సంఘం నాయకులు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మండలంలోని పామర్రు పీహెచ్‌సీ వద్ద శనివారం పీహెచ్‌సీ సిబ్బందితో కలసి గోడపత్రికను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 21వ రాష్ట్ర మహా సభలకు సంఘ సభ్యులు, ఉద్యోగులు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పామర్రు పీహెచ్‌సీ వైద్యులు మాణిక్యం, సూపర్‌వైజర్ మల్లికార్జునుడు, సీహెచ్ సూర్యారావు, వీవీవీ త్రిమూర్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రక్షణ చర్యలు తప్పనిసరి

రామచంద్రపురం రూరల్: రైతులు పంట పొలాల్లో పురుగు మందులు పిచికారీ చేసేటప్పుడు మాస్క్, గ్లౌజులు, శరీరం కనిపించవని విధంగా కోట్ ధరించి రక్షణ చర్యలు అవలంబించాలని మండల వ్యవసాయ అధికారి ఎస్. సత్యప్రసాద్ రైతులకు సూచించారు. మండలంలోని వెంకటాయపాలెంలో డాక్టర్ వైఎస్సార్ పొలం బడి కార్యక్రమం శనివారం నిర్వహించారు. మానవ శరీరంపై పురుగు మందుల ప్రభావం ఏఏ భాగాలపై పడుతుందనేది మానవ శరీరం పటం చూపుతూ వివరించారు. విష ప్రభావం బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్, వీపీఏ రేవతి, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

ఓటరు సర్వేకు సహకరించాలి

మండపేట: నియోజకవర్గంలో నిర్వహించనున్న ఓటరు సర్వేకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని నియోజకవర్గ ఓటరు నమోదు అధికార ఎస్.సుధాసాగర్ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం పలు రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఓటర్ల అడ్రస్, పోలింగ్ బూత్‌ల మార్పులు, చేర్పులు, వలస వెళ్లిన వారి పేర్ల తొలగింపు తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమం విజయవంతానికి అందరు సహకరించాలన్నారు. అలాగే రోజువారీ నివేదికలతో పాటు వారాంతరపు నివేదికలు అందజేయాలని తహసీల్దార్లు, ఎలక్షన్ డీటీలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు సుధాసాగర్ సూచించారు. ఎలక్షన్ డీటీ అవతార్ మెహర్‌బాబా, డీటీ పద్మ, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పేదల ఆనందం ఇంటింట కాదయా..

- జగనన్న లేఅవుట్లలో ఊపందుకున్న ఇళ్ల నిర్మాణాలు
- కపిలేశ్వరపురం మండలంలో 25 లే అవుట్లు
- 1638 ప్లాట్లకు తొలి దశలో 487 నిర్మాణాలు పూర్తి
- వివిధ దశల్లో 885 ఇళ్ళు



కపిలేశ్వరపురం జగనన్న కాలనీలో ప్రజాప్రతినిధుల చిత్ర పటాలతో అందంగా తీర్చిదిద్దుకున్న ఇల్లు

కపిలేశ్వరపురం: ప్రభుత్వమంటే పేదల పక్షమని నిరూపిస్తున్నారు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. నాలుగేళ్ల పాలనలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ లబ్ధిని అందిస్తూ పేదల కళ్లల్లో ఆనందాన్ని నింపిన ఘనత ఆయనది. గత ప్రభుత్వాల కాలంలో ఊరుకు పదో, ఇరవయ్యో ఇళ్ళ స్థలాలు ఇచ్చేవారు. స్థలాలు ఇవ్వకుండా రుణాలనిచ్చి చేతులు దులుపుకునేవారు. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం స్థలాన్ని ఇస్తూనే ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయాన్ని సైతం చేస్తుంది. దానితో సరిపెట్టుకోకుండా జగనన్న కాలనీని పర్యావరణ హితంగా తీర్చిదిద్ది విద్యా, వైద్యసేవలను దరి చేరుస్తోంది. కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్న నేపథ్యంలో ఈ కథనం...

మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం

జగనన్న లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పన, లేఅవుట్ల లెవెలింగ్ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం శాస్త్రీయంగా ముందుకు సాగుతోంది. కాలనీల్లో తాగునీరు, అంతర్గత రహదారులు, రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్ కనెక్షన్ల వంటి వసతులు కల్పించే ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా కల్పిస్తున్నారు. పడమరఖండ్రిక తదితర లేఅవుట్లలో విద్యుత్ లైన్ల నిర్మాణం పూర్తయింది.

మెండుగా ప్రభుత్వ సాయం

లబ్ధిదారుని ఇంటిని యూనిట్‌గా పరిగణించి ప్రభుత్వం రూ.లక్షా 80 వేలు అందజేస్తోంది. ఇటుక, ఐరన్, సిమెంట్ తదితర నిర్మాణ సామగ్రిని లేఅవుట్ల వద్దే సిద్ధం చేశారు. మహిళా శక్తి సంఘంలో సభ్యులకు ప్రభుత్వం చొరవతో రూ.35 వేల రుణ సదుపాయం కల్పిస్తోంది. నిర్మాణాన్ని ప్రారంభిద్దామనుకునే ఆలోచన ఉన్నవారికి తక్షణ సాయంగా రూ.5 వేలు, మెటీరియల్ తరలించుకుని బోర్లు వేస్తున్న దశలో రూ.15 వేలు ఇవ్వాలంటూ ప్రభుత్వం ఇటీవల ఆదేశాలిచ్చింది. అభిరుచి మేరకు, భవిష్యత్తు అవసరాలకై మరింత నాణ్యతతో నిర్మించుకోదలచిన వారికి నిర్మాణ ప్రణాళికలో వెసులుబాటు సైతం ప్రభుత్వం కల్పించింది. నిరు పేదలకు పథకంలో పేర్కొన్న నిర్దిష్ట ప్రమాణాల మేరకు ప్రభుత్వమే ఉచితంగా ఇంటిని నిర్మించి అందజేస్తుంది.

మొదటి బిల్లులోనే అధిక మొత్తం చెల్లింపు

ఇంటి నిర్మాణం తొలి దశ బిల్లులోనే ఎక్కువ రుణ మొత్తం మంజూరు చేస్తుంది. బేస్‌మెంట్ లెవెల్ పూర్తి కాగానే పథకం అమలు తొలి రోజుల్లో రూ.53 వేల బిల్లు చేసేవారు. అది కాస్తా ఇటీవల రూ.70 వేలకు పెంచారు. రెండో దశలో రూ.60 వేలు ఇచ్చేవారు. దాన్ని రూ.50 వేలకు మార్పు చేశారు. మూడో దఫాగా రూ.24 వేలను కాస్తా రూ.30 వేలకు నాలుగో విడతలో రూ.30 వేలు చెల్లిస్తారు.



పడమర ఖండ్రికలోని జగనన్న కాలనీ

మండలంలోని క్షేత్ర స్థాయిలో నిర్మాణాలిలా...

గ్రామం	లేఅవుట్లు	ప్లాటు	పూర్తయినవి	నిర్మాణదశలో	బిల్లు చెల్లింపు
కపిలేశ్వరపురం	02	621	157	274	3,59,17,295
అచ్యుతాపురం	02	238	32	161	66,57,278
పడమరఖండ్రిక	02	193	120	53	1,98,98,846
నేలటూరు	04	139	61	71	1,33,70,905
అంగర	03	128	26	80	60,05,580
వల్లూరు	01	115	38	61	97,77,807
మాచర	01	107	22	51	59,07,593
వెదురుమూడి	03	57	13	32	36,10,988
తాతపూడి	03	34	09	24	20,43,162
నిడసనమెట్ట	01	33	07	16	23,75,319
వాకతిప్ప	01	14	02	12	9,60,195
నాగుల చెరువు	01	11	--	10	3,09,712
వడ్లమూరు	01	04	--	01	-------
మొత్తం	25	1638	487	885	10,68,34,680

అద్దెభారం తప్పింది



దీర్ఘకాలంగా అద్దె ఇంటిలో బతికాం. నెలనెలా అద్దె కట్టాలన్న బాధ్యత భారంగా మారేది. మాది బీసీ సామాజికవర్గానికి చెందిన వ్యవసాయ కూలి కుటుంబం కావడంతో దీర్ఘకాలం పాటు సొంత ఇంటిని నిర్మించుకోలేకపోయాం. ప్రభుత్వం స్థలాన్ని ఇచ్చి ఇల్లు కట్టుకునేందుకు ఆర్థిక సాయం చేయడంతో సొంత ఇల్లు కట్టుకుని సంతోషంగా జీవిస్తున్నాం. అద్దె భారం తప్పింది.

– సుందరపల్లి ఆదిలక్ష్మి, అచ్యుతాపురం

సొంత ఇంటి కల నెరవేరింది



ఎప్పటికైనా సొంత ఇంటిలో నివసించాలన్నది నా కోరిక. జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకోవడంతో తీరింది. నా భర్త రాజ్‌కుమార్ డ్రైవర్‌గా శ్రమిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కొంత కాలంగా అద్దె ఇంటిలో ఉంటూ వచ్చాం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాకు ఇంటి స్థలాన్ని ఇచ్చారు. ఆర్థికసాయం సైతం చేయడంతో సొంత ఇంటికల సాకారమైంది.

– తవిటికి ఉషారాణి, వడ్లమూరు

ప్రజా ప్రతినిధిగా గర్వపడుతున్నాను



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఎంపీటీసీగా ఉన్నందుకు గర్వపడుతున్నాను. గతంలో ఏ ప్రభుత్వమూ చేయలేనన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. నా ప్రాదేశిక నియోజకవర్గం పరిధిలో అర్హత గల ప్రతి కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఏదొక పథకంలో లబ్ధిని చేకూర్చగలుగుతున్నాను.

– పలివెల మధు, ఎంపీటీసీ సభ్యుడు, వడ్లమూరు

ఆపన్నులకు అండగా ప్రభుత్వం



లబ్ధిదారుకు పింఛన్ సొమ్ము అందిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుంటుందని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం నుంచి మంజూరైన పింఛన్లను శనివారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి దుర్గారాణి అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వాల్లో పింఛన్ల కోసం పేదలు పడిగాపులు పడాల్సి వచ్చేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూరుతోందన్నారు. కౌన్సిలర్ ఎర్నేని ప్రభావతి, పార్టీ నాయకులు పులగం శ్రీనివాస్, కాట జయ, బాదంపూడి సరోజ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి హెడ్ పోస్టాఫీసు సందర్శన

రామచంద్రపురం: ఈనెల 7 నుంచి 12వ తేదీ వరకు రామచంద్రపురం ప్రధాన తపాలా కార్యాలయాల్లో విద్యార్థుల సందర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాజమహేంద్రవరం పోస్టల్ సూపరింటెండెంట్ వి కోమల్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పోస్టాఫీసుల్లో వచ్చిన వివిధ సాంకేతిక మార్పులు, పోస్టాఫీసులు నిర్వహించే వివిధ సేవలు, కార్యకలాపాల గురించి నేటి తరం పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ సందర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 76వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తపాలా శాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పాఠశాలల యాజమాన్యాలు వినియోగించుకోవాలన్నారు. ప్రత్యేక అనుమతి కొరకు ప్రజా సంబంధాల అధికారి పీవీ సుబ్బయ్య ఫోన్ నంబర్ 70135 95065ను సంప్రదించాలని కోరారు.

రైతు పక్షపాత ప్రభుత్వమిది

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకన్నబాబు
- కేశవరం సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం



కౌలుదారులకు రుణాలు అందిస్తున్న వెంకన్నబాబు, ఎంపీపీ శ్రీనివాస్, చైర్మన్ శ్రీనివాస్

మండపేట: తమది రైతు పక్షపాత ప్రభుత్వమని, అన్నదాతల అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు అన్నారు. మండలంలోని కేశవరం సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం శనివారం ఘనంగా జరిగింది. చైర్మన్‌గా ముక్కపాటి శ్రీనివాస్, పర్సన్‌లుగా చేబోలు పోసుబాబు, చంద్రమళ్ల ఏసయ్య ప్రమాణ స్వీకారం చేశారు. పార్టీ నేత కొప్పిరెడ్డి ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి వెంకన్నబాబు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవతో గ్రామ రైతుల చిరకాల కోరికైన పుంత రోడ్లు అభివృద్ధికి నోచుకున్నాయన్నారు. సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేస్తానన్నారు. అనంతరం కౌలు రైతులకు మంజూరైన రుణాల చెక్కులను చైర్మన్ శ్రీనివాస్ పంపిణీ చేశారు. తొలుత వెంకన్నబాబు ఆధ్వర్యంలో తీన్‌మార్ వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో పార్టీ శ్రేణులు నూతన కమిటీ సభ్యులతో కలిసి గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మాజీ సర్పంచ్ దూలం ఆనందరావు, ఆర్‌బీకే మండల చైర్మన్ అన్నందేవుల చంద్రరావు, ఎంపీటీసీ సభ్యులు అన్నందేవుల కృష్ణారావు, చంద్రమళ్ల పోతురాజు, గ్రామ ప్రముఖుడు పెదపాటి ఉమామహేశ్వరరావు, పార్టీ నాయకులు సలాది శివన్నారాయణ, మన్నే నారాయణమూర్తి, తుపాకుల ప్రసన్న కుమార్, అల్లంపల్లి కిషోర్, అద్దంకి రమణ, సమతం పాపారావు, యడ్ల రవి, చంద్రమళ్ల లాజరు తదితరులు పాల్గొన్నారు.

కుడుపూరు సొసైటీ చైర్మన్‌గా సుబ్రహ్మణ్యం

కె.గంగవరం: మండలంలోని కుడుపూరు ప్రాథమిక పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్‌పర్సన్‌గా మేడిశెట్టి సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ చైర్‌పర్సన్‌గా నియమించిన రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకంతో రైతుల సంక్షేమానికి, సంఘం అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సర్పంచ్ పిల్లి రాంబాబు, సీఈఓ నున్న చిన్నారి తదితరులు నూతన చైరపర్సన్‌ను పూలదండలతో సత్కరించారు.



చైర్మన్‌గా నియమితులైన సుబ్రహ్మణ్యం

కళ్ల కలక నివారణ మాత్రల పంపిణీ


రామచంద్రపురం రూరల్: మండలంలోని వెలంపాలెంలో మహాత్మా జ్యోతీరావ్ పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో చిన్నారులకు ద్రాక్షారామ హోమియో వైద్యశాల డాక్టర్ విజయ ప్రతిభ నేతృత్వంలో గ్రామ సర్పంచ్, ఏపీఈడబ్ల్యూడీసీ డైరెక్టర్ టేకుమూడి సుజాత ఆధ్వర్యంలో కళ్లకలక నివారణ మాత్రలు వేశారు. కార్యక్రమంలో మంత్రి వేణు తనయుడు, యువ నాయకుడు చెల్లుబోయిన నరేన్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు హోమియో మాత్రలు వేశారు. ఈ సందర్భంగా నరేన్ మాట్లాడుతూ కళ్ల కలక వ్యాధి ఒకరి నుంచి ఒకరికి వేగంగా వ్యాప్తి చెందే లక్షణం ఉండటం వలన విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తుమ్మూరి సుబ్బలక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ, పాఠశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ వి. వెంకటలక్ష్మి, స్టాఫ్ నర్సు ఎస్తేరు పర్వీన్ గోల్డ్, డిప్యూటీ వార్డెన్ ఈ.సుగుణ, ఉపాధ్యాయినులు కొప్పిశెట్టి రేణుక, ఎం.కెంపు రత్నం, వి.భవాని, పి.ధనలక్ష్మి, నాయకులు చల్లా శ్రీను తదితరులు పాల్గొన్నారు.



బీసీ గురుకుల పాఠశాల విద్యార్థినులకు హోమియో మాత్రలు వేస్తున్న నరేన్

ప్రజా సంక్షేమానికి చిరునామా వైఎస్సార్ సీపీ

రామచంద్రపురం రూరల్: రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి చిరునామాగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిలుస్తోందని రాష్ట్ర మంత్రి వేణు తనయుడు, యువ నాయకుడు చెల్లుబోయిన నరేన్ అన్నారు. మండలంలోని వెలంపాలెంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వంలో సర్పంచ్, ఏపీఈడబ్ల్యూఈడీసీ డైరెక్టర్ టేకుమూడి సుజాత, ఎంపీటీస తుమ్మూరి సుబ్బలక్ష్మి, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ తదితరులతో కలసి పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా జరిగిన మేలును వివరించారు. అన్ని వర్గాల ప్రజలకు అండదండలు అందిస్తున్న సీఎం జగన్‌కి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ పలివెల నాగరాజు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వాసంశెట్టి లావణ్య, నాయకులు చల్లా శ్రీను తదితరులు పాల్గొన్నారు.



వెలంపాలెం గ్రామస్తులతో చెల్లుబోయిన నరేన్, ప్రజాప్రతినిధులు

మొక్కలను సంరక్షించుకోవాలి



మొక్క నాటుతున్న చైర్‌పర్సన్ శ్రీదేవి, తొగరు మూర్తి తదితరులు

రామచంద్రపురం: ప్రతి ఒక్కరూ మొక్కలను సంరక్షించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అన్నారు. విశ్వ చైతన్య శక్తి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మిషన్ ప్రకృతి కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. వసలపూడి రోడ్డులో ప్రధాన రహదారికి ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చైర్‌పర్సన్ హాజరయ్యారు. చైర్‌పర్సన్ శ్రీదేవి మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్క పెద్దది అయ్యే వరకు సంరక్షించుకోవాలని దాని కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. జిల్లా బ్లడ్ డోనర్స్ క్లబ్ నిర్వాహకుడు తొగరు మూర్తి, మున్సిపల్ కమిషనర్ కె శ్రీకాంత్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు విజయ్, వంశీ, గోపీ శ్రీరామ్, సాయి, వినయ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్‌కు నియామక పత్రం అందజేత

కె.గంగవరం: రామచంద్రపురంలోని పట్టణ పార్టీ కార్యాలయం వద్ద శనివారం మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తనయుడు చెల్లుబోయిన నరేన్ తామరపల్లిలో నూతనంగా ఎంపికైన వలంటీర్‌కు నియామక పత్రాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన విధులను బాధ్యతతో నిర్వహించి తమకు కేటాయించిన కుటుంబ సభ్యుల మన్ననలు పొందాలని విజ్ఞప్తి చేశారు. సంక్షేమ పథకాల అమలు ప్రజలకు వివరించడంతో పాటు ప్రతి కుటుంబం లబ్ధి పొందేలా చూడాలని సూచించారు. సర్పంచ్ తోకల మంగ, సచివాలయాల మండల కన్వీనర్ తోకల శ్రీను, గ్రామ కన్వీనర్ దుర్గారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కులగణన వేగవంతం చేయాలి

రామచంద్రపురం: రాష్ట్రంలో సమగ్ర కులగణన వేగవతం చేయాలని జై భారత్ సామాజిక విప్లవ రణభేరి ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి డేవిడ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఖదిజ్ఞాని యోధ లోకనాథ్‌లు రాష్ట్ర బీసీ సంక్షేమం సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. సమగ్ర కులగణన దిశగా ఏపీ ప్రభుత్వం సమగ్ర కులగణనకు నిర్ణయం తీసుకోవటం అభినందనీయమని దీనికి త్వరగా పూర్తి చేయాలని వారు కోరినట్లు తెలిపారు. ఈ మేరకు మంత్రి వేణుగోపాలకృష్ణ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

చలో అమలాపురం విజయవంతం చేయాలి

రామచంద్రపురం రూరల్: ఈనెల 10న బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలో అమలాపురం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ బీజేపీ అమలాపురం పార్లమెంటరీ జిల్లా ప్రధాన కార్యదర్శి దూడల శంకరనారాయణ ఆధ్వర్యంలో పలువురు సర్పంచ్‌లను ఆహ్వానించారు. కేంద్రం పంచాయతీల అభివృద్ధికి కేటాయిస్తున్న నిధులు ఆయా గ్రామాల అభివృద్ధికి వినియోగించేలా మార్పులు వచ్చేలా పనిచేయాలని కోరారు. మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లను కలసి ఆహ్వానించారు.

లింక్‌రోడ్డును అభివృద్ధి చేయాలి

కాజులూరు: మండలంలోని మొగలిపాలెం–శీల గ్రామాల మధ్య ఉన్న లింక్‌రోడ్డు శిథిలావస్థకు చేరుకుని అధ్వానంగా తయారైంది. కోరంగి కెనాల్ నుంచి శలపాక చానల్ కాలువగట్టును ఆనుకుని ఉన్న ఈరోడ్డును గత 12 సంవత్సరాల క్రితం ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రావెల్ మట్టి వేసి అభివృద్ధి చేశారు. నిర్మాణ సమయంలో నాణ్యత ప్రమాణాల లోపం కారణంగా నిర్మించిన ఏడాదికే రోడ్డు శిథిలావస్థకు చేరుకుంది. రహదారి మధ్యలో పలు చోట్ల పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో ట్రాక్టర్, ఆటో వంటి వాహనాలతో పాటు సైకిల్, బైక్ వంటి వాహనాలు సైతం ప్రయాణించేందుకు వీలు లేకుండా పోయింది. మండలంలోని శీలలంక, ఒంటితాడి, శీల, మంజేరు గ్రామాల ప్రజలు మొగలిపాలెం మీదుగా గొల్లపాలెం, కాకినాడ చేరుకునేందుకు ఈ లింక్‌రోడ్డు దగ్గర మార్గంగా ఉంటుంది. రోడ్డు పొడవునా నిలువెత్తు గోతుల ఏర్పడి ప్రమాదం భరితంగా మారిందని దీంతో వాహనాల రాకపోకలకు అవకాశం లేకుండా పోతుందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



గోతులతో అధ్వానంగా మారిన మొగలిపాలెం–శీల లింక్‌రోడ్డు

టీహెచ్‌ఆర్ కిట్ల పంపిణీ

మండపేట: టేక్ హోం రేషన్ కింద ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం కోరారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను శనివారం వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్‌తో కలిసి సర్పంచ్ ఆశీర్వాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు తాతపూడి రాజేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తున్న సర్పంచ్ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ నాగబాబు

సమస్యల పరిష్కారంలో ముందుండాలి

- ఎంపీపీ, జెడ్పీటీసీ, ఏఎంసీ చైర్మన్
- రాయవరం మండల పరిషత్ సమావేశం

రాయవరం: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ముందుండాలని ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు అన్నారు. రాయవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఎంపీపీ నౌడు వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. శ్రీనివాసరావు, వెంకటరమణ, మంగతాయారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తోందన్నారు. గ్రామాల్లో మౌళిక సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ శాఖల అధికారులు వారి పరిధిలో జరుగుతున్న పనుల ప్రగతిని వివరించారు. తహసీల్దార్ కేజే ప్రకాష్ బాబు, ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి, ఎంఈవో పి.లక్ష్మణమూర్తి, ఏవో కొప్పిశెట్టి ప్రభాకర్, ఐసీడీఎస్ సీడీపీవో అధికారి గజలక్ష్మి, ఆర్‌డబ్ల్యూస్ జేఈ చైతన్యకుమారి తదితరులు వారి శాఖల ప్రగతిని వివరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు కొవ్వూరి అమ్మిరెడ్డి, గుబ్బల సుబ్రహ్మణ్యం, కో–ఆప్షన్ సభ్యుడు పోలిమాటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరమణ

చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం

రాయవరం: చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. నేషనల్ డీ వార్మింగ్ డే నిర్వహణపై శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అవగాహన సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు దేవి రాజశ్రీ , శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 10న నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. అనంతరం డీ వార్మింగ్ డే ప్రాధాన్యతను తెలిపే పోస్టర్లను ఆవిష్కరించారు. ఐసీడీఎస్ పీవో అధికారి గజలక్ష్మి, ఎంపీహెచ్‌వో తులసీదాస్, హెల్త్ ఎడ్యుకేటర్ సరోజిని, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ దుకాణంపై 6ఎ కేసు నమోదు

రాయవరం: మండలంలోని చౌకధరల దుకాణం 30పై, ఎండీయు వెహికల్ నంబరు 12పై రాజమహేంద్రవరం విజిలెన్స్ అధికారులు 6ఎ కేసు నమోదు చేశారు. ఎండీయు వాహనాన్ని వేమగిరి రమేష్ నిర్వహిస్తుండగా, వీఆర్ఏ ఖండవిల్లి రవిబాబు అథంటికేషన్‌తో సరకులు ఎండీయు వాహనానికి ఇస్తున్నారు. విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో 389 కేజీల బియ్యం తక్కువగా ఉన్నట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. అలాగే 103 కేజీల పంచదార అధికంగా ఉన్నట్లుగా గుర్తించి షాపు నంబర్ 30, ఎండీయు వాహనం 12పై 6ఎ కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ సీఐ వై.సత్యకిషోర్ తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ తహసీల్దారు కె.విజయకుమార్, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దారు ఎస్కే ఆలీషా పాల్గొన్నారు.